క్లుప్తంగా

మేడ్చల్ వెళ్లి పింఛన్ అందజేత



మేడ్చల్ జిల్లా, పూడూరులో రమణారెడ్డికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీరు మహబూబ్ బాషా

జూపాడుబంగ్లా: స్థానిక గ్రామ సచివాలయం–2 పరధిలో నివాసముంటున్న హోటల్ రమణా రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఆయన చికిత్స నిమిత్తం తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ జిల్లా పూడూరులో నివాసముంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ మహబూబ్ బాషా అక్కడికి వెళ్లి పింఛన్ మొత్తం అందజేశాడు.

వెండి పుష్పాల విరాళం



వెండి పుష్పాలు అందజేస్తున్న నారాయణ శైలేష్

వెలుగోడు: పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి నారాయణ శైలేష్ 108 వెండి పుష్పాలను కానుకగా అందజేశారు. మండల కేంద్రానికి చెందిన నారాయణ శైలేష్ వ్యాపార పరంగా హైదరాబాద్ లో స్థిరపడ్డాడు. స్వామి వారికి తన వంతుగా రూ.2లక్షల విలువజేసే వెండి పుష్పాలను అందజేశారు. ముందుగా వాటికి అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం దాతను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బళ్లాని వెంకట సత్యనారాయణ, లాలం నాగార్జున, బీవీ బాలయ్య, తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్ పాల్గొన్నారు.

చిరుత తిరిగే ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేయండి



రుద్రాపార్క్ వద్ద సంచరిస్తున్న చిరుత

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని రింగ్‌రోడ్డు సమీపంలో ఉన్న రుద్రాపార్క్, గంగా భవాని స్నానఘట్టాలు, మరికొన్ని ప్రాంతాల్లో చిరుత కనిపిస్తుండడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. శనివారం రాత్రి కూడా ఔటరింగ్ రోడ్డు సమీపంలోని రుద్రాపార్క్ పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలో కనిపించడంతో స్థానికులు తమ సెల్‌ఫోన్‌లో చిరుత దృశ్యాలను చిత్రీకరించారు. ఈ ఏడాదిలో ఔటర్ రింగ్‌పై ఐదారు సార్లు చిరుత కనిపించింది. శిఖరేశ్వరం వద్ద ఎలుగుబంటి సంచారం పై అప్రమత్తమైన అటవీశాఖ బోన్లను ఏర్పాటు చేసి, ఎలుగబంటిని బంధించినట్లుగానే చిరుతను బంధించేందుకు బోన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహానందిలో భక్తుల రద్దీ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: శ్రావణమాసం, పెళ్లిళ్లు ఉండటంతో పాటు సెలవురోజు కావడంతో క్షేత్రానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో సుమారు ఇరవైకి పైగా వివాహాలు ఉండటంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఉదయం అష్టవిధ మహామంగళహారతుల నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. వివిధ ఆర్జిత సేవాటికెట్లు, వసతి గృహాలు, ప్రసాదాల విక్రయం తదితర విభాగాల ద్వారా ఒకే రోజు సుమారు రూ. 7లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

నూతన బోరు ఏర్పాటు

పాములపాడు: స్థానిక దళితవాడలో నీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరును తవ్వించినట్లు సర్పంచ్ మేకల భాగ్యమ్మ తెలిపారు. ఆదివారం ఎస్సీ కాలనీలోని వైఎస్సార్ నగర్‌లో బోరు తవ్వించారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పాములపాడులో రెండు బోర్లు తవ్వించినట్లు చెప్పారు. త్వరలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కానుందని పేర్కొన్నారు.

ధరలు తగ్గించాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వ విధానం వల్ల రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పెంచిన ధరలు తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాల పేరుతో మోదీ అధికారంలోకి వచ్చి, ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా పెంచిన ధరలు, కరెంట్ చార్జీలు తగ్గించాలని, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేఎండీ గౌస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మూడు నెలల్లో మంజూరు



నా పేరు రామసుబ్బారెడ్డి, మాది కురుకుంద. ఆధార్‌కార్డు ఆధారంగా పింఛన్ కోసం వలంటీర్‌ను అడిగాను, వలంటీర్ దరఖాస్తులు తీసుకుని పరిశీలించి సచివాలయంలో ఉద్యోగిని కలవమన్నారు. ఉద్యోగిని కలిసిన 3 నెలలకే పింఛన మంజూరు అయ్యింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన తొలి పింఛన్ కానుకగా రూ.2,750లు అందుకోవడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు . – రామసుబ్బారెడ్డి, కురుకుంద

ఆనందమని 'పింఛన్'

- జిల్లాలో మొత్తం 4,963 నూతన పింఛన్లు
- శ్రీశైలం, నందికొట్కూరు నియోజక వర్గాల్లో కొత్తగా 1452 మందికి మంజూరు
- 96.2 శాతం పింఛన్ల పంపిణీ
- సంతోషంతో పొంగిపోతున్న లబ్ధిదారులు



పింఛన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారిఫ్

ఆత్మకూరు: ఎన్నో నెలలుగా ఎదురు చూస్తున్న వృద్ధులు, వితంతువులకు నూతన పింఛన్లు మంజూరు కావడంతో ఆనందంతో పొంగిపోతున్నారు. ఈ నెల అందరితో పాటు కొత్త లబ్ధిదారులు కూడా నగదును అందుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు ఇంటి తలుపు తట్టడంతో ప్రజలు సంబరపడుతున్నారు.

గతంలో ఎవరైనా మృతి చెందితేనే కొత్త పింఛన్

టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ మంజూరు కావాలంటే కుటుంబంలో లేదా గ్రామాల్లో ఎవరైనా మృతి చెందితే తప్పా కొత్త పింఛన్లు మంజూరు అయ్యేవికాదు. ఫలితంగా అన్ని అర్హతలున్నప్పటికీ పింఛన్ల మంజూరు కోసం నెలల తరబడి ఎదురు చూసే దుస్థితి ఉండేది. అంతే కాకుండా టీడీపీ నాయకులు, దళారులు చెప్పిన వారికే పథకాలు వర్తించేవి. ప్రస్తుతం ప్రభుత్వం నూతన పింఛన్లు ఇంటి వద్దకే పంపిణీ చేయడంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మురిసిపోతున్నారు.

శ్రీశైలం నియోజకవర్గంలో 621 మంది..

జిల్లాలో నూతనంగా పింఛన్లు మంజూరైన 4,963 మంది, శ్రీశైలం నియోజకవర్గంలో 621 మంది లబ్ధిదారులు నగదు అందుకున్నారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రమాణంగా సచివాలయ సిబ్బంది, అధికారులు గుర్తించి దరఖాస్తు ఇవ్వడంతోనే అర్హత ఉంటే ప్రభుత్వ పథకాలు దక్కున మంజూరవుతున్నాయి. గ్రామసచివాలయ సిబ్బంది, ఆయా గ్రామాల నాయకులు, పట్టణంలోని ప్రజాప్రతినిధులు, వలంటీర్లు నూతన పింఛన్లను నేడు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న అర్హులైన లబ్ధిదారులు పింఛన్ మంజూరు కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాకూ అందరితో పాటు పింఛన్లు వస్తాయని ఆనందపడుతున్నారు.

వితంతువులకు త్వరితగతిన పింఛన్ల మంజూరు

జిల్లాతో పాటు శ్రీశైలం నియోజకవర్గంలో వితంతువులకు త్వరిత గతిన పింఛన్లు మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కింది. నేరుగా లబ్ధిదారుల ఇళ్లముంగిళ్లకు నగదు చేరుతోంది. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో వృద్ధులకు, వికలాంగులకు, వితంతవులకు పింఛన్ రూ.2 వేల నుంచి పెంచుతూ రూ.3 వేలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు పింఛన్ దారులు ఈ నెల రూ.2,750 చొప్పున అందిస్తున్నారు. ప్రస్తుతం నూతన లబ్ధిదారులకు కూడా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసినందుకు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం మీద 96.2శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని అధికారులు తెలిపారు.

ఆత్మకూరు డివిజన్ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్ల వివరాలు..

మండలం	మంజూరైన పింఛన్లు
ఆత్మకూరు	98
బండి ఆత్మకూరు	118
జూపాడు బంగ్లా	93
కొత్తపల్లి	89
మహానంది	112
మిడుతూరు	102
నందికొట్కూరు	86
పగిడ్యాల	126
పాములపాడు	156
శ్రీశైలం	41
వెలుగోడు	141
ఆత్మకూరు (అర్బన్)	111
నందికొట్కూరు(అర్బన్)	179
మొత్తం	1452

పింఛన్ రావడం సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మంజూరు చేయడం ఆనందంగా ఉంది. తొలిసారిగా ఫించన్ తీసుకున్నా. వృద్ధాప్యంలో ఎంతో భరోసాగా ఈ డబ్బులు ఉపయోగపడతాయి. పింఛన్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి మేలును మరిచిపోలేను.

– మహబూబ్ ఖయ్యూం బాషా, ఎస్పీజీ పాలెం, ఆత్మకూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరు చేశాం



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఫించన్ మంజూరు చేశాం. ఇంకా అర్హులైన వారెవరైనా ఉంటే వారికి కూడా మంజూరు చేస్తాం. ప్రభుత్వం నియమాల ప్రకారం అర్హత ఉంటే చాలు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందజేస్తాం.

– శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్,ఆత్మకూరు

పౌష్టికాహారంతో క్షయ వ్యాధి దూరం



రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు/కొత్తపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా క్షయవ్యాధిని దూరం చేయవచ్చునని అశ్విని హాస్పిటల్ వైద్యుడు శ్రీనివాసరెడ్డి(ఊపిరితిత్తుల నిపుణులు), గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విజయేంద్ర తెలిపారు. ఆదివారం గోకవరం గ్రామంలోని జి.పుల్లారెడ్డి ఆసుపత్రి ఆవరణలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, పౌష్టికాహారం పంపిణీ చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లోని ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో క్షయవ్యాధి అనుమానిత వ్యక్తులకు వైద్య పరీక్షలు చేశామన్నారు. మొత్తం 103 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి చికిత్స ప్రారంభించామన్నారు. డాక్టర్ ఏ.రాయుడు, సేవా భారతి ప్రతినిధులు వాసుదేవరెడ్డి, సత్యనారాయణ, టిబి యూనిట్ ఆత్మకూరు సూపర్‌వైజర్లు కే మస్తానయ్య, రవి కుమార్,సౌజన్య రాణి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఇరవై ఏళ్లుగా మహానందికి పాదయాత్ర



మహానందిలో భజనలు చేస్తున్న తుగ్గలి మండల భక్తబృందం సభ్యులు

మహానంది: భజనలు చేసుకుంటూ పాదయాత్రగా వచ్చి మహానందిలో శివనామ స్మరణ చేస్తూ, భజనలు చేసి మహానందీశ్వరుడిని దర్శించుకుని గంగాజలాన్ని తీసుకెళ్లి గ్రామంలోని ఆలయాల్లో దేవతలను అభిషేకిస్తే వర్షం కురుస్తుందని వారి ప్రగాఢ నమ్మకం. అందులో భాగంగా కర్నూలు జిల్లా తుగ్గలి మండానికి చెందిన శ్రీ లక్ష్మీచెన్నకేశవ భజన సంఘం సభ్యులు సుమారు 30 మంది ఆదివారం మహానంది చేరుకున్నారు. ఈ మేరకు స్థానిక అలంకార మండపంలో భజనలు చేసి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం రుద్రగుండం కోనేరులోని పవిత్రమైన గంగాజలాన్ని తీసుకెళ్లి తమ గ్రామాల్లోని ఆలయాల్లో కొలువైన శివపార్వతులు, సీతారాములు, ఆంజనేయస్వామి వార్లను అభిషేకిస్తామని సంఘం సభ్యులు రామయ్య, వెంకటేశ్వర్లు, రామచంద్రుడు తెలిపారు. ఇలా ఇరవై ఏళ్లుగా మహానంది వస్తున్నట్లు వివరించారు.

వాహన రికార్డులు తప్పనిసరి



వాహనాలను తనిఖీ చేస్తున్న ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున

పగిడ్యాల: వాహన యజమానులు తప్పనిసరిగా రికార్డులను కలిగి ఉండాలని, రికార్డులు లేని వాహనాలను సీజ్ చేసి ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగిస్తామని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున తెలిపారు. ఆదివారం లక్ష్మాపురం క్రాస్ రోడ్ల వద్ద వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా వాహన రికార్డులు లేని, ఓవర్ కెపాసిటీతో వచ్చిన పగిడ్యాల గ్రామానికి చెందిన ఏపీ 21టీఈ0569, ఏపీ21ఈసీ0259, ఏపీ21టీజెడ్8160, ఏపీ21టీజెడ్7372 నంబర్లు గల త్రీ వీలర్ ఆటోలను సీజ్ చేసి ఆర్టీఏకు అప్పగించినట్లు చెప్పారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల్లోని వాహన చోదకులు రికార్డులను కలిగి, అప్‌డేట్ చేయించుకోవాలన్నారు.

ఉపాధి కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలం

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, దేశ జనాభాలో 30 సంవత్సరాల వయస్సులోపు యువత 60 శాతం ఉన్నారని, ఉన్నత చదువులు చదివి కూలీ పనులకు వెళ్తున్నారని డీవైఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు టి.రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో విద్యారంగం, నిరుద్యోగంపై సదస్సు నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, లక్ష్మణ్, శివ, రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌కుమార్ మాట్లాడుతూ 1.50కోట్ల మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారన్నారు. దేశంలో నిరుద్యోగ వ్యవస్థ 7శాతానికి పైగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజల కష్టాలు తీర్చడం కోసం బీజేపీ ప్రభుత్వం పని చేయడం లేదని విమర్శించారు. పోస్టులను భర్తీ చేయకపోవడంతో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ రంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు.

దూదేకులకు రిజర్వేషన్లు పెంచాలి



మాట్లాడుతున్న పీర్ మహమ్మద్

నంద్యాల(న్యూటౌన్): నూర్‌బాషా దూదేకులకు బీసీ కమిషన్ ప్రకారం బీసీ–ఈ రిజర్వేషన్ 4 శాతం నుంచి 12 శాతానికి పెంచి, అందులో దూదేకులకు 50శాతం భాగస్వామ్యం కేటాయించాలని, రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నూర్‌బాషా దూదేకుల బీసీ, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డి.మస్తానమ్మ, రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబన్ కోరారు. ఆదివారం పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల బీసీ ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా దూదేకుల కులస్తులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిలో 5 ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. మైనార్టీ విద్యాసంస్థల్లో దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. కళాకారులకు, కులవృత్తికి పెన్షన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ దస్తగిరి, ఖాదర్‌బాషా, సిద్దయ్య, ఇదాయతుల్లా పాల్గొన్నారు.

రాజకీయ సాధికారత కల్పించాలి



సంఘీభావం తెలుపుతున్న దళిత, గిరిజన, బహుజన సంఘాల నాయకులు

నంద్యాల(అర్బన్): దళిత, గిరిజన ప్రజా ప్రతినిధులకు రాజకీయ సాధికారత కల్పించాలని రాష్ట్ర దళిత సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు మేకల లింగస్వామి తెలిపారు.పట్టణంలోని ఓ హోటల్‌లో ఆదివారం దళిత,గిరిజన, బహుజన సంఘ నాయకుల సమా వేశం నిర్వహించారు.నాయకులు సీనియర్‌న్యాయవాది రాంప్రసాద్,గుర్రంలక్ష్మి, రాజ్‌కుమార్, చిరంజీవి, దేవదాస్,విజయకుమారి,ప్రవీణ్,రాజునాయక్ పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం



దుద్యాల గ్రామ సమీపంలో కళకళలాడుతున్న మినుము పంట



పారుమంచాల సమీపంలో పారుతున్న ఇసుకవాగు



చౌట్కూరులో పొగాకు నాటుతున్న కూలీలు

కొత్తపల్లి: శనివారం రాత్రి మండలంలో మోస్తరు వర్షం కురవడంతో రైతన్నలకు కొంతమేర ఊరటనిచ్చింది. ఎండిపోతున్న పంటలకు గతనెల 29న కురిసిన 20.4 మి.మీల వర్షానికి, నిన్నటి వర్షం తోడుకావడంతో పంటలు జీవం పోసుకున్నాయి. మండలంలో కపిలేశ్వరం, ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, లింగాపురం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, బావాపురం, వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో 16.4 మి.మీల వర్షపాతం నమోదైందని ఏఎస్ఓ రాజ్‌పాల్ ఆదివారం తెలిపారు.

జూపాడుబంగ్లా: ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో రైతులు కాస్త కుదుటపడ్డారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 52.4 మి.మీ.గా నమోదైందని ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరులో అత్యధికంగా 74.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా కొత్తపల్లి మండలంలో 16.4 మి.మీ. నమోదైందన్నారు. జూపాడుబంగ్లా మండలంలో 52.4ఎం.ఎం , పగిడ్యాలలో 42.6ఎం.ఎం, పాములపాడు మండలంలో 20.6 మి.మీ. ప్రకారం వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

మిడుతూరు: మండలంలోని పీరుసాహెబ్ పేట, కడుమూరు, 49–బన్నూరు, పైపాలం, నాగలూటి, మాసపేట, తలముడిపి, వీపనగండ్ల, తిమ్మాపురం, చింతలపల్లి, దేవనూరు, చెరుకుచెర్ల తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండలంలో 58.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల్లో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు నిండాయి. భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చౌట్కూరు, కడుమూరు, మాసపేట, ఉప్పలదడియ, కలమందలపాడు, పైపాలం గ్రామాల్లో పొగాకు నాట్లు జోరందుకున్నాయి.

ఆత్మకూరు: మండలంలో ఆదివారం వేకువజామున మోస్తరు వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు 17.8 మి.మీ వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.25 రోజుల తర్వాత వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే కొందరు అన్నదాతలు మొక్కజొన్న పంటను తొలగించారు. బోరుబావుల కింద సాగు చేసిన మెట్టవరి, మొక్కజొన్న, పత్తి పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుంది.

పగిడ్యాల: బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా మండలంలో కురిసిన వర్షం 42.6 మీ.మీ. నమోదైనట్లు మండల సహాయ గణాంక అధికారి ఎల్లగౌడ్ ఆదివారం తెలిపారు. దాదాపు నెల నుంచి చినుకు రాలకపోవడంతో ఖరీఫ్‌లో భాగంగా సాగు చేసిన పలు పంటలు ఎండు దశకు చేరుకున్నాయి. ఇక ఈ ఏడాది నష్టాలు తప్పవనుకున్న సమయంలో వరుణుడు కరుణించడంతో కొంత ఉపశమనం పొందారు.

దేవస్థానం కాలనీలో ఎలుగు సంచారం

మహానంది: మహానంది గ్రామ పరిసరాలను ఎలుగుబంటి వదిలివెళ్లడం లేదు. ఇప్పటికే ఈశ్వర్‌నగర్ కాలనీతో పాటు ఆలయ ప్రాంగణంలోని నంది విగ్రహం, కరివేన సత్రం వరకు వచ్చిన ఎలుగుబంటి తాజాగా ఆదివారం రాత్రి మరోసారి దేవస్థానం కాలనీలోని చివరి వీధిలోకి వచ్చింది. దేవస్థానంలో పనిచేసే ఉద్యోగి లక్ష్మయ్య ఇంటి పరిసరాల్లోకి రాత్రి ఎలుగుబంటి రావడంతో స్థానికులు ఈలలు, కేకలు వేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయిందని లక్ష్మయ్య తెలిపారు. ఎలుగుబంటి సంచరిస్తుండటంతో ఆయా కాలనీవాసులతో పాటు భక్తులు భయాందోళనలకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటిని పట్టుకుని అడవిలో వదిలిపెట్టాలని కోరుతున్నారు. తల్లి ఎలుగుబంటి తప్పిపోయి ఉంటే పిల్లలు వస్తున్నాయా లేక పిల్లలు తప్పిపోయి ఉంటే తల్లి ఎలుగుబంటి వస్తుందా అంటూ పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

శుభకార్యం

ఆత్మకూరు: నంద్యాల పట్టణంలో ఆదివారం జరిగిన వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామానికి చెందిన బన్నూరు రామలింగారెడ్డి కుమార్తె వివాహ మహోత్సవానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే కర్నూలు పట్టణంలో జరిగిన శ్రీనివాసరెడ్డి కుమార్తె వివాహ వేడుకలో ఎమ్మెల్యే శిల్పా పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ అర్లపాడు ఎల్లమ్మ గుడి వద్ద విద్యుదాఘాతానికి గురై ఆదివారం ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి అనే రైతుకు చెందిన ఎద్దులను పశువుల కొట్టంలో కట్టేశాడు. రాత్రి కురిసిన వర్షం తాకిడికి తాడు తెంపుకుని సమీపంలో ఉండే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైపు పరుగు తీసి విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిందని ప్రభాకర్‌రెడ్డి వాపోయాడు. ఎల్లమ్మ గుడి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో రక్షణ వలయం లేకుండా ప్రమాదకరంగా ఉందని, కంచే ఏర్పాటు చేయాలని స్థానిక లైన్‌మెన్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మహానందిలో నిశ్చితార్థ మండపం నిర్మాణం



నిశ్చితార్థ మండపం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం



భూమిపూజ చేస్తున్న ఈఓ, పండితులు

మహానంది: ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి కల్యాణోత్సవానికి ముందు జరిగే నిశ్చితార్థం వేడుకలకు సంబంధించిన మండపం స్థానంలో నూతనంగా నిర్మించేందుకు దాతలు ముందుకొచ్చారు. ఈ మేరకు ఆదివారం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు భూమిపూజ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంప్రదాయం ప్రకారం పెళ్లికుమారుడు, పెళ్లి కుమార్తెలైన స్వామి,అమ్మవార్ల తరపున గుండంపాడు, గుండుపాపల గ్రామాలకు చెందిన దాతలు కల్యాణంలో పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. పూర్వం నిర్మించిన నిశ్చితార్థ మండపం స్థానంలో వసతులతో కూడిన మండపం నిర్మించేందుకు దాతలు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు.

బృందావనం గోశాల నిర్మాణం

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తులకు గోసేవలో భాగస్వామ్యం కల్పించడంతో పాటు గోసంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నంద్యాల మండలం పొన్నాపురంకాలనీకి చెందిన కంబగాని తిరుమలగౌడ్, కళావతి దంపతుల ఆధ్వర్యంలో తొమ్మిది గోవులతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక గోశాల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం దాతలకు ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేసి సన్మానించారు.

మహానందీశుడి సేవలో..



మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన నటుడు సెల్వరాజ్



మహానందికి వచ్చిన నటుడు శాంతికుమార్

మహానంది: టీవీ సీరియల్స్, కామెడీ షోల ద్వారా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు లభించిందని ప్రముఖ టీవీ సీరియల్స్ నటుడు సెల్వరాజ్ (చక్రవాకం ఇక్బాల్), కమెడియన్ శాంతికుమార్ అన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మహానంది వచ్చారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. సెల్వరాజ్ మాట్లాడుతూ చక్రవాకం సీరియల్ ద్వారా అందిరికీ ఇక్బాల్‌గా సుపరిచితుడనయ్యానని, అలాగే మొగలి రేకులు సీరియల్ మంచి గుర్తింపు ఇచ్చిందన్నారు. తమ్ముడు సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన నటించానని, ఇప్పటి వరకు సుమారు పదిహేను సినిమాలు, పదిహేను సీరియళ్లలో నటిస్తున్నానని, త్వరలో సొంత బ్యానర్‌పై సినిమా తీయనున్నట్లు చెప్పారు. సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు వారికి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేయించారు. వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ ఉప్పు జగన్‌ప్రసాద్, పట్టణ నాయకులు శాంతిరాం ప్రసాద్, నూనెపల్లె దేవా, శ్రీకాంత్, గోస్పాడు గిరి పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

పగిడ్యాల: స్థానిక 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట, లక్ష్మాపురం, ముచ్చుమర్రి ఫీడర్‌ల పరిధిలో రైతులకు సోమవారం నుంచి నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ ఏఈ క్రాంతికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పడమర ప్రాతకోట, లక్ష్మాపురం ఫీడర్‌ల కింద ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ముచ్చుమర్రి ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.